

కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి కమలానగర్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

కమలానగర్‌లో డిప్యూటీ మేయర్ పర్యటన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో నెలకొన్న సమస్యలపై జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలు, సంక్షేమ సంఘ భవనాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిప్యూటీ మేయర్‌ను కోరారు. స్థానికంగా ఉన్న గ్రంథాలయంలో చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్, కాలనీవాసుల అవసరాలకు వినియోగించడంతో డే కేర్ సెంటర్‌కు ఇబ్బందిగా మారిందని సిబ్బంది వివరించారు. సమస్యలపై పర్యటించి పరిశీలించిన డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించి పరిష్కారంపై జోనల్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. మాచవరం వెంకటేశ్వర్లు వారి ట్రస్టు ద్వారా మహిళలకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన కుట్టు మెషిన్లను ఆమె అందజేశారు. హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య, డీఈ నీలిమ, ఏఈ హేమునాయక్, బీజేపీ నాయకులు బండారి భాస్కర్, గంగాని శ్రీను, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సుబ్బారావు, ఉపేందర్‌రెడ్డి, పూలమ్మ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు 282 దరఖాస్తులు



మీసేవ కేంద్రం వద్ద ప్రజల రద్దీ

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మీసేవ ద్వారా కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. మూడు రోజుల నుంచి జీహెచ్‌ఎంసీలో పెద్దఎత్తున మీసేవ కేంద్రాలకు ప్రజలు క్యూకడుతున్నారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ మీసేవ కేంద్రంలో ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులకోసం 282 దరఖాస్తులు వచ్చాయి. మీసేవ కేంద్రం సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. మీసేవ కేంద్రాల వద్ద ప్రజల రద్దీ కొనసాగుతుంది. కొత్త వాటికోసం దరఖాస్తు చేసుకోవడం అదనంగా కుటుంబ సభ్యులపేర్లు నమోదు చేసుకోవడం ఇంకా కొన్ని రకాల మార్పులు చేర్పులు చేసుకునేందుకు వస్తున్నారు.

వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అక్బర్‌బాగ్ డివిజన్‌లోని నిరుపేద మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లను కార్పొరేటర్ సయ్యద్ మిన్హాజుద్దీన్ శనివారం పంపిణీ చేశారు. వంటగ్యాస్ సిలిండర్ల కనెక్షన్ల కోసం డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచనల మేరకు ఉచితంగా కొత్తగా గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఇప్పటికి ఇంకా గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద కుటుంబీకులు వంట గ్యాస్ కనెక్షన్ల కోసం సంప్రదిస్తే ఉచితంగా అందజేస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అన్వర్‌పాషా పాల్గొన్నారు.

సహభావన టౌన్‌షిప్‌లోని సమస్యలు పరిష్కరించండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని సహభావన టౌన్షిప్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు రాజీవ్ స్వగృహ జనరల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన ఆమెకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సహభావన టౌన్షిప్‌కు కాంపౌండ్ వాలు లేకపోవడంతో జంతువులు లోనికి రావడంతో నివాసితుల్లో అభద్రతాభావం నెలకొందన్నారు. వర్షపునీటి కారణంగా ప్రతి టవర్‌లోని ఫ్లాట్ల పైకప్పులు, గోడలు దెబ్బతిన్నాయని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు. డీఈఈ రవీందర్‌రెడ్డి, ఏజీఎం అనిల్‌రెడ్డి, టౌన్షిప్ సభ్యులు నల్ల మునీందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాకేష్, చంద్రశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

ఉత్తమ పేరెంట్‌కు ఘన సన్మానం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంధుల ప్రాథమిక పాఠశాల దారుల్ షిఫాలో శనివారం జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)లో ఉత్తమ పేరెంట్‌గా 5వ తరగతి విద్యార్థి గోపీ తల్లి రేణుకను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మెను ఉత్తమ పేరెంట్ రేణుకను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జావిద్, రవీందర్‌రెడ్డి, జానయ్య, అంజద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీబీఎస్ఈ టెన్త్ పరీక్షలు

చంపాపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బ్రహ్మప్రకాష్ డీఏవీ స్కూల్, డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయం కంచన్‌బాగ్, డిఫెన్స్ ల్యాబొరేటరీ స్కూల్‌లో శనివారం నుంచి ఆరంభమైన సీబీఎస్ఈ టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు ఇంగ్లిష్ పరీక్షను నిర్వహించారు. బ్రహ్మప్రకాష్ డీఏవీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 600మందికి గాను 600మంది విద్యార్థులు, కేవీ కంచన్‌బాగ్‌లో 583మందికి గాను 582మంది, డీఎల్ఎస్ స్కూల్‌లో 133మందికి గాను 132మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సామాజిక సేవల్లోనూ మిధానీ ముందుంటుంది

● సీఎండీ ఎస్.గౌరీశంకర్‌రావు

చంపాపేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సంస్థ అయిన మిధానీ దేశం యొక్క వ్యూహాత్మక అవసరాలు తీర్చడమే కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రాజెక్టుల ద్వారా సమాజసేవలోనూ ముందుంటుందని ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎస్.గౌరీశంకర్‌రావు పేర్కొన్నారు. సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.16.65లక్షల నిధులతో సంస్థ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు కేటాయించిన ట్రునెట్ టీబీ యంత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు ఎ.రామకృష్ణారావు, హరికృష్ణ, ఎఆర్ రష్మి, ఎ.రాజేశం, డాక్టర్ చలాదేవి పాల్గొన్నారు.

30శాతం ఫీజులు పెంచిన ప్రైవేట్ స్కూల్

● ఆందోళనకు దిగిన పేరెంట్స్



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఒక్క సారిగా 30శాతం అధికంగా ఫీజులు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. వారం రోజులుగా పాఠశాల యాజమాన్యం పెంచిన ఫీజులు చెల్లించాలని కోరుతూ విద్యార్థులకు నోటీసులు అందించారు. గత శుక్రవారమే విద్యార్థులు పెంచిన ఫీజులపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం కల్పించుకుని వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పేరెంట్స్ నిరసన విరమించారు. శుక్రవారంతో వారం రోజులు పూర్తి కావడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు మరో సారి సమావేశమై పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. పాఠశాల యాజమాన్యం దిగి రావాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా 30శాతం ఫీజు అదనంగా చెల్లించాలంటే ఎలా చెల్లించాలని పలువురు ప్రశ్నించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



సేవాలాల్ జయంతి వేడుకల్లో డప్పు కొడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, పాల్గొన్న శ్రీరాములుయాదవ్ తదితరులు



సేవాలాల్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతానర్సింహారెడ్డి



నందనవనంలో సేవాలాల్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ సుజాతానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తుల్లో సేవాలాల్ మహారాజ్ ఒకరని, శివాజీ తర్వాతి స్థానంలో నిలిచిన మహనీయుడు ఆయనే అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని శనివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో స్థానిక బంజారా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారాల వాయిద్యమైన డోలు వాయించి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారాల హక్కుల కోసం పోరాడిన నాయకుడు : సబితారెడ్డి

సేవాలాల్ బంజారాల హక్కుల కోసం పోరాడిన నాయకుడని, ఆయన ఓ సామాజిక, సంఘ సంస్కర్తగా ఖ్యాతి గడించారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. లెనిన్‌నగర్‌లో నిర్వహించిన జయంతి వేడుల్లో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీగల, పారిజాత పూజలు

మీర్‌పేట్ లెనిన్‌నగర్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం, పూజల్లో పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంజారా కాలనీలో..

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ బంజారాకాలనీలో బంజారా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో భాగంగా సేవాలాల్ మహారాజ్ బోగ్ బండారును ఘనంగా జరుపుకున్నారు. పెద్ద ఎత్తున్న బంజారా కాలనీవాసులు పాల్గొని సేవాలాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రమావత్ నజీ మంగయ్యానాయక్, కాలనీ అధ్యక్షుడు కె. దేవి జాంజ్యా నాయక్, జటోత్ పంతునాయక్, మూడావత్ గాసీరాంనాయక్, కంటోతు పాండునాయక్, గోవర్ధన్‌నాయక్, బలరాంనాయక్, అంజమ్మ, కొర్ర గోపాల్‌నాయక్, దేవారాం నాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

చంపాపేట: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం హస్తినాపురం డివిజన్ నందనవనంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్పొరేటర్ సుజాతానాయక్ హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన సోదరులు పాల్గొన్నారు.



వేడుకల్లో హోమం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



సేవాలాల్ జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల

ధర్మభిక్షం ప్రజల మనిషి

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ధర్మభిక్షం ప్రజల మనిషి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని శనివారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆయన విగ్రహానికి ఆ పార్టీ నాయకులు రత్నాకర్‌రావు, రవీంద్రాచారి, యాదిరెడ్డితో కలిసి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఐ పక్షాన మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా సేవలు చేసి ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. భూ పోరాటాల ద్వారా సుమారు 4,500 ఎకరాల సాగు భూమిని పేదలకు పంపిణీ చేసిన గొప్ప నాయకుడన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో 6 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష అనుభవించిన నిజమైన భారత విప్లవకారుడన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నర్సింహ, పురం యాదగిరిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రమేష్‌గౌడ్, ప్రసాద్, యాదగిరి, చందన, రవి, రమేష్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని శనివారం హయత్‌నగర్ సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి హాజరై ధర్మభిక్షం చిత్రపటానికి నవాళులు అర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్‌గౌడ్, సక్రునాయక్, నాగరాజు, కృష్ణ, సౌజన్య, రాధ, ఆదిలక్ష్మి, సుశీల, మమత, కవిత, శ్రీను పాల్గొన్నారు.

కొత్తపేట : ధర్మభిక్షం జయంతి సందర్భంగా శనివారం న్యూనాగోల్‌లోని ప్రజా సంఘాల కార్యాలయం డాంగే భవనంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బొడ్డుపల్లి కృష్ణ, అనుబంధ సంఘాల నాయకులు శ్రీదేవి, మమత, మల్లేష్, సౌజన్య, శంకర్‌నాయక్, లౌక్య పాల్గొన్నారు.



ధర్మభిక్షం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి తదితరులు

బీసీలను రాజకీయంగా వాడుకోవాలని చూస్తే సహించం : జాజుల

మన్సూరాబాద్ : బీసీలను రాజకీయంగా వాడుకోవాలని ఏ పార్టీ చూసినా సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మాజీ ఎంపీ ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు కురెళ్ల వేములయ్యగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచేవరకు ఎవరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు దుర్గయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కలనకాల రామ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రఘురాంనేత తదితరులు పాల్గొన్నారు.

15.950 కిలోల గంజాయి స్వాధీనం

(5వ పేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని గుట్టుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన సరఫరాదారులకు సరుకును అందజేయడంతో వారు రైల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన స్మగ్లర్స్ సికింద్రాబాద్ వరకు సరుకును తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్, ధనుంజయకు శనివారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు బృందం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి స్మగ్లర్స్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ అభినందించారు.

చిక్కడపల్లిలో 8మంది అరెస్టు

చిక్కడపల్లి: గంజాయి తాగడానికి గుమిగూడడంతోపాటు గంజాయి బేరాలు చేస్తున్న 8 మందిని శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్ బస్‌భవన్ ఎదురు వీధిలో రిసాలకు చెందిన మహ్మద్ సిద్దిక్‌ఖాన్(25), మహ్మద్ నాసిర్(20), మహ్మద్ సైఫ్(20), రామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్(25), బేగంపేటకు చెందిన పీక జతిన్(21), పీక ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్(21), తిరుమలగిరికి చెందిన ఎస్ విఘ్నేష్(26)లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంతోకలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా వీరిలో అయిదుగిరిని కోర్టులో ప్రవేశపెట్టామని మిగతా ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వారివద్దనుంచి 300 గ్రాముల గంజాయి, 12270 రూపాయలు, 2 బైక్‌లు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి , డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ హెచ్చరించారు.

కేపీహెచ్‌బీలో వ్యక్తి

హైదర్‌నగర్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోహెల్ కేపీహెచ్‌బీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిపట్టుకున్నారు. అతని వద్ద నుంచి 650గ్రాముల డ్రై గంజాయి, 20ఎంఎల్ హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని ఎస్‌ఓటీ పోలీసులు అతనిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెయిల్‌పై విడుదలై పరారీలో..

● తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్టు

హైదరాబాద్ సిటీ : బెయిల్‌పై విడుదలపై పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లను సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట, మాదన్నపేట పోలీస్టేషన్‌లలో 18చోరీ, దాడి కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ అల్‌ఐదూర్ అలియాస్ హబీబ్ తల్హ బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పలు పోలీస్టేషన్‌ల పరిధిలో 7 నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. మాదన్నపేట పోలీస్టేషన్ పరిధిలో రౌడీషీటర్ కె. ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నుపై రౌడీషీటర్ భక్తియాస్ ఖురేషీ హత్యకేసుతో పాటు ఎన్‌డీపీఎస్, ఆర్మ్‌యాక్ట్ వంటి 11కేసులున్నాయి. గంజాయి కేసులో 2024 ఆగస్టులో ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతడిపై 2 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వీరిద్దరూ మాదన్నపేటలో ఉన్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఇద్దరినీ ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు.

ప్రేమికురాలి కుటుంబసభ్యుల వేధింపులతో

యువకుడి ఆత్మహత్య



మహ్మద్ ఇమ్రాన్(ఫైల్)

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమికురాలి కుటుంబసభ్యుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ కళంధర్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్(26) చంద్రాయణగుట్ట జీఎంకాలనీ ప్రాంతానికి చెందిన మహమద్ అబిద్‌అలీ కూతురు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం అమ్మాయి తండ్రి ఆబిద్‌అలీకి తెలవడంతో 3రోజుల క్రితం ఇమ్రాన్ ఇంటికి వచ్చి మాట్లాడి పెండ్లి విషయంపై చర్చిద్దామని వెళ్లిపోయాడు. అనంతరం ఈనెల 14వ తేదీన చంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఇమ్రాన్ తన కూతురుని వేధిస్తున్నాడని అమ్మాయితో ఫిర్యాదు చేయించాడు. దీంతో పోలీసులు ఇమ్రాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఈ విషయంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఇమ్రాన్ ఇంటికి వచ్చి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు తన మృతికి కారణం తను ప్రేమించిన అమ్మాయి కుటుంబసభ్యులు, ముఖ్యంగా అమ్మాయి తండ్రి ఆబిద్‌అలీ ముఖ్య కారకుడని ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతూ తన ఆత్మహత్యపై సుసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు స్థల వివాదం

● నిర్మాణాలు కూల్చి స్థల యజమానులపై దాడి

● గుర్తు తెలియని వ్యక్తులపై కేసు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ప్రైవేటు స్థలంలోకి చొరబడి స్థలానికి సంబంధించిన ప్రహరీ, గేటు, రేకులను తొలగించడంతో పాటు స్థల యజమానిపై దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్‌లోని ఆగమయ్యనగర్‌కాలనీలో సాయికిరణ్, వైష్ణవి, అరుణ్ సాయి, మాధురిల పేరిట 7 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. కాగా ఈ ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేసేందుకు 2006లో గాయత్రి డెవలపర్స్‌కు అప్పగించారు. ఒప్పందం ప్రకారం డెవలపర్స్ పనులు చేయడం లేదంటూ నాటి నుంచి స్థల యజమానులకు, డెవలపర్స్‌కు మధ్య వివాదం కొనసాగుతూ ఉంది. ఈ వివాదం కోర్టుకు వెళ్లింది. ఇటీవల స్థల యజమానులు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ప్రహరీ కూల్చి గేటు, రేకులను తొలగించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న స్థల యజమానులపై దాడిచేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసుకున్న వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల నిజాయితీ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రాత్మకమైన ఎగ్జిబిషన్‌లో విధి నిర్వహణలో ఉన్న మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు తమ నిజాయితీని చాటుకున్నారు. శుక్రవారం రాత్రి ఎగ్జిబిషన్ గేట్-3 వద్ద డ్యూటీలో ఉన్న మలక్‌పేట ట్రాఫిక్ కానిస్టేబుల్ మమత, హోంగార్డు వై.నర్సింహారావులకు పర్సు దొరికింది. అందులో మొబైల్ ఫోన్, కొంత నగదు ఉన్నట్లుగా గుర్తించారు. మొబైల్ ఫోన్ ఆధారంగా పర్సు పోగొట్టుకున్న మహిళను గుర్తించి తిరిగి ఆ పర్సును అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. విషయం తెలుసుకున్న మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ కానిస్టేబుల్ మమత, హోంగార్డు వై.నర్సింహారావును అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు, సాధారణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ నర్సింహారావు, పీసీ రమేష్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ మల్లాపూర్, షరీఫ్‌నగర్, పహాడీషరీఫ్ తదితర ప్రాంతాల్లో 5 విద్యాసంస్థల్లో, 5 ప్రధాన కూడళ్లలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

33 మందికి డీడీ కౌన్సెలింగ్

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 33మంది మద్యంప్రియులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో చిల్డ్రన్‌పార్కు లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓపీ అల్లూరయ్య పాల్గొన్నారు.

మారణాయుధంతో సంచరిస్తున్న పాతనేరస్థుడి అరెస్టు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మారణాయుధంతో సంచరిస్తున్న పాత నేరస్థుడిని చాదర్‌ఘాట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేటలోని కుషి ఫంక్షన్‌హాల్ సమీపంలో నివాసముంటున్న మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ తక్లా ఇమ్రాన్(26) పలు కేసుల్లో పాతనేరస్థుడు. ఓల్డ్‌మలక్‌పేటలోని వాటర్ ట్యాంక్ పరిసరాల్లో మారణాయుధంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. పోలీసులను చూసి మారణాయుధాన్ని అక్కడే పారవేసి పారిపోతుండగా అనుమానం వచ్చి పట్టుకున్నాడు. అనంతరం విచారణ జరపగా మారణాయుధంతో సంచరిస్తున్న విషయం బయటపడింది. పౌచ్‌తో కూడిన మారణాయుధం(కత్తి)ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ పిల్లర్ల గుంతలో పడి బాలుడి మృతి



జేశ్వన్(ఫైల్)

సంతోష్‌నగర్ : ప్రమాదవశాత్తు భవన నిర్మాణ పిల్లర్ల కోసం తవ్విన గుంతలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం, రామదుగ్యాల మెగ్యతాండాకు చెందిన శ్రీనునాయక్, అనుష భార్యభర్తలు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఓల్డ్ సంతోష్‌నగర్‌కాలనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం 8.30గంటల సమయంలో శ్రీనునాయక్ కుమారుడు జేశ్వన్(6) తన సోదరితో కలిసి ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. ఆడుకుంటూ సమీపంలో భవన నిర్మాణంలో ఉన్న ప్రదేశానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు భవన నిర్మాణ పిల్లర్ల కోసం తవ్విన గుంతలో పడిపోయాడు. గుంతలో నీరు నిండి ఉండడంతో బాలుడు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గమనించి బాలుడిని బయటకు తీసి ఓవైసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ హ్యాక్.. స్క్రీన్ బ్లాక్ చేసి రూ.1.43 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్

● కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినందుకు..

హైదరాబాద్ సిటీ : కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికిన బాధితుడు.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. అతడిని మాటలతో మాయచేసిన క్రిమినల్స్ మోసపూరిత లింక్‌లు పంపి ఫోన్ హ్యాక్ చేసి రూ. 1.43 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 399 డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లు చూస్తే 'కుకు ఎఫ్‌ఎమ్' సబ్‌స్క్రైబ్ నిమిత్తం డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో ఎలాగైనా డబ్బులు డెబిట్ కాకుండా ఆపేయాలని, 'కుకు ఎఫ్‌ఎమ్' కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అప్పుడు అతడికి ఒక నంబర్ కనిపించింది. వారికి ఫోన్ చేసి తన సబ్‌స్క్రైబ్‌ను తొలగించాలని కోరాడు. అందుకు అవతలి వ్యక్తి స్పందిస్తూ.. ఏ బ్యాంక్ నుంచి డబ్బులు డెబిట్ అవుతున్నాయో ఖాతా వివరాలు ఇవ్వండి అని చెప్పాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత ఒక లింక్‌ను పంపి ఓపెన్ చేసి, మీ ఖాతా నుంచి రూ.1 ట్రాన్స్‌ఫర్ చేయండి ఆ తర్వాత మేము లావాదేవీలు అన్ని ఆపేస్తామని హామీ ఇచ్చాడు. అందుకు సంబంధించిన ప్రాసెస్ అంతా వీడియోకాల్ చేసి చూపించాడు. బాధితుడు వారు చెప్పినట్లు చేశారు. తన ఖాతా నుంచి రూ. 1 డెబిట్ అయిన వెంటనే బాధితుడి ఫోన్ స్క్రీన్ బ్లాక్ అయింది. ఫోన్ ఆన్‌లోనే ఉండడంతో బాధితుడు తన స్క్రీన్ బ్లాక్ అయిన విషయాన్ని చెప్పగా.. కంగారు పడొద్దు. కొద్దిసేపు అలాగే అవుతుంది. కాసేపట్లో ప్రాసెస్ అయిపోతుందని నమ్మించాడు. ఆ తర్వాత ఫోన్‌లో ఎవరూ స్పందించలేదు. బాధితుడు అయోమయానికి గురయ్యాడు. సుమారు 40 నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ స్క్రీన్ ఆన్ అయింది. ఆ తర్వాత వెంటవెంటనే బ్యాంకు మెసేజ్‌లు రావడాన్ని గుర్తించి చెక్ చేయగా.. తన ఖాతా నుంచి మొత్తం రూ. 1,43,212 డెబిట్ అయినట్లు తేలింది. దాంతో హుటాహుటిన బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా.. మీరు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడంతో వారు మీ ఖాతాలో డబ్బులు దోచేశారని చెప్పారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.